


# నేనూ కథా రచయితనే! కాకపోతే....

**- ఆవంత్స సోమసుందర్**

పిఠాపురంలో వారింటికెళితే మేడ మీద రెండు గదులనిండా నిండు గర్భిణిల్లాంటి పుస్తకాల బీరువాలు. ఒక కుర్చీ, టేబిల్, మంచం పక్కగా ఫోను, తలగడ దగ్గర మొబైల్, అంత సులభంగా కనపడకుండా ఓ మూల దాచిన చుట్టలపెట్టె, మంచం మీద పరుచుకున్న పుస్తకాలు పత్రికలు, ఉత్తరాలు, ఈ పుస్తక వల్మీకంలో 86 యేళ్ళ ఈ అభ్యుదయ సాహిత్య సవ్యసాచి దర్శనం.



ఇంటర్వ్యూ చేస్తున్న ప్రసాదవర్మతో సోమసుందర్

సోమసుందర్ (సో.సు) గారికి సాహిత్యాధ్యయనం ఒక తీరని దాహం. రచనా వ్యాసంగం ఒక తపస్సు ఒక ఆర్తి. వీరి పేరు చెప్పగానే అభ్యుదయ కవిత్వం, 'వజ్రాయుధం' జ్ఞాపకం వస్తాయి. పలు సమకాలీన కవిత్వోద్యమాలలో ప్రత్యక్ష భాగస్వామి. అనేక సాహిత్య తాత్త్విక వైవిధ్య అంశాలపై సాధికారంగా ప్రవచించగల అర్హత ఉన్న అభిజ్ఞులు. ఒక్క నాటకం తప్ప మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియలలో తన ప్రతిభా పాటవాలను చాటుకొని, సుప్రసిద్ధ అభ్యుదయ కవిగా, వ్యాఖ్యానాత్మక విమర్శకుడిగా పేరొందినవారు. 'పసిడిరథం' బాలగేయ సంపుటి రచించిన సంగీత పరిజ్ఞానమున్న అరుదైన సాహితీ వేత్త. 50 కి పైగా కథలు రాసిన (విస్మృత) కథకుడు!

మొదటితరం కథకుల తర్వాత, స్వాతంత్ర్య యుగోదయానికి పూర్వమే కథలు (1943 ప్రాంతాలలో) రాసిన వారిలో ఆవంత్స సోమసుందర్ ఒకరు. ఈ కథకుణ్ణి నేటి సాహిత్యలోకం దాదాపు మరచిపోయిందనే చెప్పుకోవాలి. సంప్రదాయ సాహిత్యమనే బలమైన పునాదిపై యూరప్, అమెరికా రష్యా వంటి పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాల అవగాహనతో తన సాహిత్య సౌధ బృహన్నిర్మాణాన్ని చేపట్టిన విశ్వకర్మ శ్రీ సోమసుందర్. 1948-84 మధ్య సుమారు 36 సంవత్సరాల కాల పరిధిలో 50కి పైగానే కథలు రాశారు. 1950లో 'బానిసల దేశం' అనే కథల సంపుటి వచ్చింది. 1950కి పూర్వమే వచ్చిన 20 కథలలోంచి ఎంపిక చేసిన 9 కథల సంకలనం, 1984లో షష్టిపూర్తి ఉత్సవ ప్రచురణగా 'సోమసుందర్ కథలు' పేరున 29 కథల సంకలనం వచ్చింది. ఈ కథలన్నీ పత్రికలలో వచ్చినవీ, ఆకాశవాణిలో ప్రసారమై తరువాత పత్రికలలో ప్రచురింపబడినవీను. ''కవి కథకుడైనప్పుడు కథ కావ్యం అవుతుంది. ఛందస్సులు మొదలైన ఏ శృంఖలాలూ లేని 'కవిత' కథా రచన'' అన్నది సో.సు పై చా.సో గారి తీర్పు. 84 తరువాత వీరు కథలు రాసినట్టుగాని ప్రచురించినట్టు గాని లేదు. ఎనభైకి పైగా గ్రంథాలు ప్రకటించిన వారి సాహితీ వ్యవసాయం గురించి జీవనయానం గురించి వారి మాటల్లోనే....

## నన్ను కవిని చేసింది అమ్మే

తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం దగ్గరలోని శంఖవరంలో 18-11-1924లో కాళ్ళూరి సూర్యప్రకాశరావు, పెదవెంకాయమ్మల 6వ సంతానంగా జన్మించాను. నా 5వ యేట నా పిన తల్లి చిట్టివెంకాయమ్మ ఆవంత్స వెంకటరావు దంపతులు నన్ను దత్తత చేసుకున్నారు. ఆ విధంగా శంఖవరం వదిలి పిఠాపురం వచ్చాను.

పసి తనంలోనే తెలుగు భాషపై అంత మమకారం కలగటానికి భాగవతంలో వందల పద్యాలు ఉత్తరోత్తరా కంఠతా పట్టటానికీ పోతనగారి దయవల్ల ధారాశుద్ధి కలగటానికీ మా అమ్మే కారణం.కృష్ణశతకంలోని పద్యాలన్నీ మా అమ్మ కంఠతా పట్టించింది. అంతకుముందే మా పెద్దన్నయ్య వెంకట్రామారావు భక్త చింతామణి పద్యాలు, అల్లూరి సీతారామరాజు పాటలు నేర్పించేవాడు. పిఠాపురం రాజావారి ఎలిమెంటరీ స్కూల్‌లో (పెన్నాడవారి బడి) మూడవ తరగతి వరకు చదువు. కత్రా సత్యన్నారాయణశాస్త్రిగారి వద్ద అమరం, శబ్దమంజరి, బాల రామాయణం చెప్పించారు. 1943లో ఎస్.ఎస్.ఎల్.సి. కాకినాడ పి.ఆర్.కాలేజీలో ఇంటరు చదివి బి.ఎ. డిగ్రీలో చేరాను కాని కమ్యూనిస్ట్ పార్టీలో కార్యకలాపాల వల్ల చదువు సాగలేదు.

## ఈ మట్టిలో మొలిచినవే నా కథలు

అనేక సాహితీ ప్రక్రియల్లో ఆరితేరినా, తరచుగా కథలు రాసి ప్రచురించక పోవటం వల్ల కథకునిగా నేను చాలా తక్కువ మందికి తెలుసు. కథా రచనలో భుజబలం అట్టే చూపించలేదు. కవిత్వం మీద, విమర్శ మీద ఉన్న ఆసక్తి, అభిలాష కథల మీద లేదనుకోవడానికి వీల్లేదు.నా పద్ధతి కథా రచన విరివిగా రాయటానికి అడ్డు పడుతుంది. కేవలం మనసులో ఊహించీ, భావించీ కథ రాయటం నాకు సుతరామూ కిట్టదు. సమాజంలో జరిగిన ఒక సంఘటనో సన్నివేశమో మూలధాతువుగా ఏర్పడితే తప్ప కథ సాగదు. ఆ తర్వాత కథనరీతి గురించి, సంవిధానం గురించి మథనపడటం కథాంశం గురించి నోట్సు రాసుకోవటం ఇత్యాది కృత్యాద్యవస్థ ఉంటుంది. చివరికి ఒకటి రెండు సార్లు తిరగరాయటమూ ఉంటుంది. నా కథల గురించి ఒక సత్యం చెప్పక తప్పదు. ప్రతి కథా ఈ దేశపు మట్టిలో మొలిచినదీ నా గుండెలో పెరిగినదీ తప్ప ఏ విదేశీ సాహిత్యం నుంచో ఎరువు తెచ్చుకున్నదో కొల్ల గొట్టినదో ఎంత మాత్రం కాదు. అదే నా కథల బలమూ బలహీనతా కూడా.

## నేటి సాహిత్యం కిటకిటలాడే రైలు బండి

నేటి సాహిత్యం ఒక రైలుబండిలా సాగిపోతోంది. వేలాది కవులూ రచయితలూ క్రిక్కిరిసి ప్రయాణం చేస్తున్నారు. రైలూ ప్లాట్‌ఫాం కూడా కిటకిట లాడుతున్నాయి. కథా రచనల్లోనూ ఇతర సాహిత్య ప్రక్రియల్లోను ఉత్సాహం, ఉబలాటం కనిపిస్తున్నంత విరివిగా అధ్యయనం అనుశీలనం కనిపించటం లేదు. ముఖ్యంగా రచయితలు, గోర్కీ చెప్పినట్లుగా సామాన్యుడికన్న పది రెట్లు ఎక్కువ చదవాలి. ఏ భాషలోనైనా మనసు చీకటి గొయ్యారంలో మణిదీపాల్ని వెలిగించేవే గొప్ప కథలు. మహనీయుడు గురజాడ



ధర్మమా అంటూ తెలుగు కథ జన్మించిన ముహూర్తం గొప్పది. దేవుళ్ళ పేర్లు పుట్టు పూర్వోత్తరాలు నేరుగా ప్రశ్నించిన ప్రారంభంతో ఎన్నో గొప్ప కథలు తెలుగు జాతి సంపదగా నిలిచాయి.

## నేను 'పెరిగిన' పిఠాపురం

కవిత్వమే కవిత్వానికి తల్లి తండ్రి కూడా. మంచి కవిత్వం చదువుతుంటే చదువుతున్న వాడు కొంతయినా మంచి కవిత్వం రాయకుండా బతకలేడు. అయితే ప్రపంచ సాహిత్యంతో గాఢమైన అనుబంధం ఏర్పడిన 1830 తర్వాత కాలంలో కథలు విపరీతంగా పెరిగాయి. నా మటుకు నేను మాతృభిక్షతో ముందు పద్యాల్లాంటివి చెప్పేయ్యడం అలవాటయింది. తర్వాత పాటలు కట్టి పాడటం అలవాటయింది. అంటే పుట్టుకతోటే నాలోని కవికి ఒక చేయి పద్యం ఒక చేయి పాట అందేయన్న మాట. ఆ పునాదిలోంచే నా ఉత్తర జీవితమంతా గడిచింది. పిఠాపురం ఆనాడు బహుముఖ సాహిత్య వేదిక. సంగీత సాహిత్యాలలో ఓలలాడుతూ ఉండేది. ఏదైనా ఒక సభ జరుగుతూంటే నాకర్థమైనా లేకపోయినా వెళ్ళి ముందు వరసలో కూర్చునే వాణ్ణి. ఆఖరికి మేజువాణీలు కూడా. సానులు పాడుతున్నప్పుడు జావళీలు అన్నీ కంఠతా వచ్చేవి. ఇంటికి వచ్చి పాడుతూ వాళ్ళ పద్ధతిలో అభినయం చేసేవాణ్ణి. ఈ అనుకరణ గొప్ప విద్యాభ్యాసమయింది. నాకు కవిత్వం రక్తసంబంధమైన వారసత్వంగా లభించినది కాదు. కాని నా జనకులు లోకజ్ఞులు. కొన్ని వందల పద్యాలు లోకోక్తులు సామెతలు సందర్భాన్ని బట్టి ఉపయోగించేవారు. అవి నా మనసులో నిలిచి పోయాయి. అది ప్రథమ ప్రేరణ. కాని నన్ను కవిగా మార్చినది మాత్రం నేను పెరిగిన పిఠాపురం మట్టి.

నిజం చెప్పవలసి వస్తే నేను మంచి కుటుంబీకుణ్ణి కాను. ఏ రూపంలోనయినా నాకు కుటుంబం పట్ల అభినివేశంగాని ఆర్తిగాని, బాధ్యతగాని ఉన్నవాణ్ణి కాను. సమూహంలో ఉన్నా ఏకాంతికంగా బతకటం నాకు మా గురువులు అలవాటు చేశారు. మదర్‌ఫిక్సేషన్ ఒక్కటే గైడెన్స్‌గా నేను కవినయ్యాను.

## శేష ప్రశ్న!

నా రచనల ద్వారా నేనేమి సాధించాననేది కఠినమైన ప్రశ్న. దీనికి సమాధానం చెప్పటం ఒక అసిధారా వ్రతం. ఉత్తమ ప్రయోజనాలెన్నో సాధించానని చెప్పుకోవడం డంబాచారం. ఏమీ సాధించలేదని చెప్పుకోవటం ఆత్మవంచన. ఎప్పుడూ సత్యం ఈ రెండిటికీ మధ్యనే ఉంటుంది. సామాజికునిగా నా సోదర ప్రజానీకానికి సాహిత్యం ద్వారా తత్కాలీన యోచనా రశ్ములందించాను. బహుశా అంతవరకు నా కర్తవ్య ఉపాలంభన జయప్రదమయినట్లే నేమో. అయితే ఒకటి, పొట్టకూటికి వెతుక్కోవలసిన అవసరం నాకు లేకపోవటం వల్ల నేను చాలా ఎక్కువే రాశాను. రాసినవన్నీ ప్రజలకు అందించనూ లేదు. అందించిన రచనలను ఎంతమంది సక్రమంగా అందుకో గలిగేరన్నది ఎప్పుడూ నాకు శేషప్రశ్నే!

1949లో 'వజ్రాయుధం' రాశాను. కాని స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటాలు, నిజాం నిరంకుశత్వం, రజాకార్ దురంతాల వంటి ఆనాటి జనజీవన ఆరాట పోరాటాలు, సామాజిక సంచలనాలు వస్తువుగా కథలు రాయలేదు. ఎందువల్లనంటే, ఈ ఘటనలన్నీ కూడా సాహిత్య స్వరూపాన్ని అభిలషించేవే. కాని మనం అందరం అన్ని ప్రక్రియలు విజయవంతంగా చెయ్యలేం. పై సంఘటనలలో రజాకార్ దురంతాల వంటివి ఎన్నో కథలకి నవలలకి ఇతివృత్తాలు కావలసినవి. కాని నేను రాయలేదు.

## నచ్చినవి

| | | |
|---|---|---|
| రచయితలు | : | కృ.శా, విశ్వనాథ, నండూరి, బసవరాజు, మాతృగీతాల నాయని, నా తరంలో – శ్రీశ్రీ, నారాయణబాబు, తిలక్, అనిసెట్టి, కుందుర్తి |
| కథకులు | : | కొడవటిగంటి కుటుంబరావు, చా.సో. |
| సినిమా | : | నాగయ్యగారి వేమన, స్వర్గసీమ, బాటసారి/హిందీలో అధికారి, విద్యాపతి |
| నటులు | : | నాగయ్య, నారాయణమూర్తి |
| నటి | : | వనమాల, బి.ఎ.బి.టి., భానుమతి |
| గాయకులు | : | ఘంటసాల, బాలమురళి, సైగల్, కె.సి.డే రఫి |
| గాయని | : | ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, ఎం.ఎల్.వసంతకుమారి, ధనమ్మాళ్ |
| పాట | : | జి.వరలక్ష్మి పాడిన 'ఇది మొదటి రాత్రి' (జి.వరలక్ష్మి, కె.ఎస్.ప్రకాశ్‌రావ్ నాయికా నాయకులుగా వచ్చిన "ఒక రాత్రి" అన్న సినిమాలోది) |
| స్నేహితులు | : | నా జీవితమే మెషీన్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్ చాలా మంది ఉన్నారు. |



ఎన్.టి.ఆర్. జాతీయ పురస్కారం అందుకున్న సందర్భంగా...

రజాకార్లు చేసిన దురంతాలలో – ఒక హిందూ యువకుణ్ణి, యువతిని పట్టుకు బంధించి వారిద్దరిచేతా బలవంతంగా రతి చేయిస్తారు. తెల్లవారి చూసుకొంటే వారిద్దరూ అన్నా చెల్లెలు. పైగా హిందువులు! వెంటనే ఆత్మహత్య చేసుకుంటారు. ఈ కథ స్వర్గీయ తెన్నేటి సూరి రాశారు. ఇది ఎందరు రాసినా ఎన్ని రూపాలలో రాసిన మానవత్వం చిప్పిల్లే రచన. కాని ఒక్కరే ఎందుకు రాశారు? అంటే చెప్పలేం. సంఘటనలు వాతావరణం సానుకూలంగా ఉన్నంత మాత్రంలో సాహిత్యం ప్రాదుర్భవిస్తుందనుకోలేం. ఈ ఉపదకు చాలా ఉదాహరణలు చెప్పవచ్చు. చెప్పకపోయినా పాఠకులు ఆలోచించుకో గలరు.

## బిరుదులు

నాలుగో అయిదో వచ్చినట్లున్నాయి. 1949లో అనుకుంటాను పురిపండా "మహాకవి" అన్నాడు. వజ్రాయుధం వచ్చిన కొత్తల్లో. పంచాక్షరి – 'సోమసుందర్' నా పేరే నా బిరుదు అన్న పొగరుంది. పైగా అవి ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలూ లాంఛనాలూనూ.

మా రోజుల్లో మా తరంలో... అంటూ గతాన్ని ఉన్నతంగా పైకెత్తి, ఇప్పటివాళ్ళూ... అంటూ వర్తమాన తరాన్ని విమర్శించటం నాకు గిట్టదు. సామాన్యంగా యువమేధావుల్లో కుశాగ్రబుద్ధి ఉంటుంది. వేలు చూపెడితే బొమ్మ వేయగల శక్తి ఉంటుంది అట్టి వారి శక్తులకు ఆవిష్కరణ మార్గాలే కరువౌతున్నాయి.

"భారతదేశం పునరుజ్జీవన దశ నుంచి క్రమక్రమంగా తిరోగమనం సాధిస్తోంది. కులమత తత్త్వాల విషవలయం తీవ్రతరం అవుతోంది. మతతత్త్వ పార్టీలకు మునుపెన్నడూ లేనంతగా బలం యేర్పడుతోంది. మూఢ విశ్వాసాలను పాలకవర్గమే ఒక ప్రణాళికా బద్ధంగా పెంపొందింప చేస్తోంది" – అన్న 1984 నాటి నా ఆక్రోశం నేటికీ నిజమనిపిస్తుంది.

## వెబ్‌సైట్ ఉన్న తొలి తెలుగు సాహిత్యవేత్త

ఆరు దశాబ్దాలకు పైబడిన నిర్విరామ సాహిత్య కృషికి నివాళిగా సోమసుందర్ ది పొయెట్ అన్న వెబ్‌సైట్ 2007లో ప్రారంభమయ్యింది. నా జీవితకాలంలోని సాహిత్య రాశిని భావి తరాలకు అందేలా వెబ్‌సైట్‌లో భద్ర పరచిన మొట్టమొదటి తెలుగు సాహిత్యవేత్తను నేనే. మిత్రుడిగా, బోధకుడిగా సహచరుడుగా సాహిత్య ప్రపంచంలో మమేకమై, వివిధ సాహితీ ప్రక్రియల్లో నాదైన ముద్రతో రచయితలందరికీ హితుడుగా, స్నేహితుడుగా మార్గదర్శిగా కృషి సల్పుతూ 87వ యేట ప్రవేశిస్తున్నాను.


నందామ శరదశ్శతం! జీవేమ శరదశ్శతం!

–ప్రసాదవర్మ కామరుషి
సెల్: 94412 74034

నాకు నచ్చిన నా కథ

# సంచారిణీ దీపశిఖ

- ఆవంత్స సోమసుందర్



"నిండా మునిగినవాడికి చలేమిటమ్మా?"

సరిగ్గా యిదేమాట మా అమ్మమ్మ నోట ఎన్నిసార్లు విన్నానో చెప్పలేను. ఏ సంభాషణేనా ఆ మాటతోనే ముగిస్తూ వుండేదావిడ. ఇంక ఆమాట అనబోతోందీ అనగానే వెంటనే నాకు తెలిసిపోయేది. నాకు అంతగా అలవాటయిపోయాయి, ఆవిడ హావభావ విశేషాలు.

వాక్యం చివరిలో 'అయ్యో' అంటూ ఒక రాగాలాపన చేసేది. గెడ్డం మీదికి చూపుడువేలు పోనిచ్చేది. అంతే! దానితో ఆవిడ సంభాషణకు ఒక ముగింపు తేబోతోందనీ, నిండా మునిగినవాడికి చలేమిటమ్మా అని అనబోతోందనీ నాకిట్టే తెలిసిపోయేది. సంభాషణ ఆ మాటతో త్రుంచడమంటూ జరిగేదే కాని, మళ్ళీ వెంటనే ప్రారంభించదని ఎప్పుడూ అనుకోకూడదు.

నిజానికి నా జీవితంలో మొట్టమొదటిసారిగా ఈమాట విన్నదీ మా అమ్మమ్మ నోటినుంచే! అప్పటికి నాకు సరిగ్గా ఆరేళ్లు ఉంటాయి. అంతకు ముందు ఆవిడ్ని నేను చూడనూ లేదు, ఆ మాట విననూ లేదు. ఆ మాట వినగానే నాకేదో గొప్పవిషయం బోధపడీ బోధపడనట్లుగా అనిపించింది. ఒక మహా చిత్రమేదో కనిపించీ కనిపించనట్లు దృశ్యాదృశ్యంగా లీలగా కదిలిపోయింది. అసలావిడ్ని మొదటిసారి చూడడమే ఒక సుందరానుభూతి!

సన్నగా పచ్చగా దాదాపు నా అంత పొట్టిగా వుండేదావిడ. ఆవిడ జుత్తు ఎంత తెల్లగా ఉండేదో చెప్పలేను. అంతకన్నా తెల్లనిబట్ట కట్టేది. ఆవిడ రూపం, నడతా, ఆవిడ వ్యవహారాలన్నీ ఎంతో ఆకర్షణ కలిగించేవి నాకు. ఆవిడ మా యింటికి వచ్చిందంటే చాలు ఆవిడ్ని చూస్తూ, కూడా అంటిబెట్టుకు తిరగడమే నా పని! నా కెంత సంబరంగా ఉండేదో?

ఆవిడ్నించి విడివడి వుండటానికి నాకొక్క నిమిషం తీరిక ఉండేది కాదు. ఆవిడ ప్రతి పని పరిశీలించేవాడిని. ఆవిడ అందమైన ముఖాన్ని రెప్పవాల్చకుండా పరీక్షిస్తూ వుండేవాడిని.

నేనావిడ్ని అమ్మమ్మగారని అంటున్నానంటే - మా అమ్మకేమీ ఆవిడ తల్లి కాదు; ఆ సంగతి మరికొన్నాళ్ళకి గాని తెలియలేదు. అలా అనడం పెద్దది కదా అని వరినే వరసకేనట! ఆ సంగతులన్నీ మా అమ్మ నాకు చెబుతూంటే నాకెంత ఆశ్చర్యం కలిగిందో! ఇంతకీ మా

అమ్మకావిడ ఒక స్నేహితురాలు మాత్రమేనట! వయసులో బాగా పెద్దది కావటం వల్ల పిన్నీ అని పిలిచేది మా అమ్మ! నన్ను అమ్మమ్మా అని పిలవమనీ ఆవిడే చెప్పింది.

మా అమ్మమ్మగారు తరచుగా మా యింటికి వచ్చేది. అంటే మరీ తరచుగా అని కాదు; ఏడాదికి కనీసం రెండుసార్లయినా తప్పకుండా వచ్చేది. వచ్చినప్పుడల్లా నెలా రెండు నెల్లూ ఉండి మరీవెళ్ళేది! ముఖ్యంగా శివరాత్రి ముందు తప్పకుండా వచ్చేది. మా ఊళ్లో ఈశ్వరుడికి గొప్ప తీర్థం జరిగేది మరి! అప్పుడావిడ వచ్చిందంటే నాకెంత సంబరంగా ఉండేదో? జేబునిండా డబ్బులు గలగలలాడేవి మరి!

ఆవిడ రావడమే విచిత్రంగా వచ్చేది. ఒక పాత ట్రంకు పెట్టె – నిలువుగా ఉండి తలవైపుగా రెండుప్రక్కలకి మూతలు తెరచుకొనే పెట్టె తెచ్చుకొనేది. అలాంటిపెట్టె మళ్ళీ నేనక్కడా చూడలేదు. అది మళ్ళీ మళ్ళీ నల్లరంగు పూసినట్లుండేది. దానికి పెద్దతాళం కప్ప వేసేదా, కాని ఎందుకో చుట్టూ బలమైన తాడు బిగించేది. మూత విడిగా ఉండే తాటాకుబుట్ట కూడా తెచ్చుకొనేది. దానినిండా రకరకాల చిల్లర సామానులుండేవి. దేవుడి పెట్టె, ఆవునేతి సీసా, అక్షింతల డబ్బా, ఒత్తుల డబ్బా, రుద్రాక్ష మాల – అబ్బ ఎన్ని సామానులుండేవో! విప్ర వినోదుడి సంచీలాగ దానినిండా రకరకాల విచిత్ర సామాగ్రి! నాకు పనికొచ్చేవేమైనా ఉండేవేమో వెదుకుదామని ప్రయత్నిస్తే దెబ్బలాడింది. ఈ రెండూ కాక మరొక చేతిసంచీ కూడా ఉండేది. అందులో డబ్బులు వేసుకొనే సిల్కు గుడ్డ సంచీ, ఒక మందుసీసా, ఒక వెండి గ్లాసు ఒక పాత గుడ్డా తప్పకుండా ఉండేవి.

ఆవిడ ఎప్పుడూ సంచారంలోనే వుంటుందని కావలసిన సామానంతా కూడానే వుంటుందని తర్వాత మా అమ్మ చెప్పింది. ఆవిడకొక స్థిరనివాసమంటూ లేదని, అక్కడో నెలా అక్కడో రెండు నెలలూ గడిపేస్తుందనీ మా అమ్మ చెప్పింది. బహుశా మా యింటి దగ్గర జరిగినట్లే ఆవిడకు ప్రతిచోటా ఎంతో మర్యాద జరుగుతుంది కాబోలనిపించింది నాకు!

ఆవిడ తెల్లని జుత్తు కెరటాలుగా దిగజారుతూంటే అప్పుడప్పుడు వేలుముడి వేసుకొనేది. అంత ముదిమిలోనూ ఎంతో అందంగా మెరిసేదామె మొగం! కళ్ళకి వెండిఫ్రేము కళ్ళద్దాలుండేవి. అవి చింత పిక్క దళసరిలో ఉండేవి! ఆవిడ గురించి మరో విచిత్రమేమిటంటే – ఆవిడెప్పుడూ అన్నం తినేది కాదు; ఐదే మినపగారెలు స్వయంగా నేతితో వేయించుకునేది. తన వెండిగ్లాసుతో గ్లాసుడు కాఫీ తాగేది. రాత్రి కదీ లేదు, ఒక గ్లాసుడు పాలు త్రాగేదంతే. మందు పుచ్చుకున్నా, మంచినీళ్ళ త్రాగినా ఆ గ్లాసు తప్ప మరోటి ముట్టుకొనేది కాదు. ఆవిడ యినప పెట్టెలో కావలసినంత డబ్బా తప్పకుండా అట్టడుగున దాచుకొనేది!


ఇంతకీ ఆవిడ పేరే చెప్పడం మరిచాను, జానికమ్మగారు!

***

బహుశా నాకు కొంచెం తెలిశాక అదే మొదటిసారేమో – ఒక శుక్రవారం సాయంత్రం వచ్చింది. ఎల్లుండే శివరాత్రి! నాకు బాగా జ్ఞాపకం వుంది. ఆవిడ్ని చూడగానే నాకెంతో ఆనందం కలిగింది. ఎగిరి గంతువేశానన్నా తప్పులేదు. పెరట్లో పని చేసుకుంటున్న మా అమ్మ దగ్గరికి ఒక్క పరుగులో వెళ్ళి ఈ శుభవార్త అందించాను. మా అమ్మ కూడా చేతులేనా కడుక్కోకుండానే వచ్చేసింది. ''అయ్యో జానికమ్మ పిన్నీ! ఈ మాటింత ఆలస్యం చేశావేమమ్మా? రోజూ నిన్ను గురించే తల్చుకుంటున్నా'' అంటూ అమ్మమ్మని లోపలికాహ్వానించింది. వచ్చిన దగ్గర్నుంచీ అమ్మమ్మ – రాజేశ్వరికెంత జబ్బు చేసిందో, యెన్ని యిబ్బందుల్లో పడి పోయిందో ఎన్నెన్నో సంగతులు చెప్పింది. ఆవిడ కబుర్లు వింటూ అమ్మ ఒకటి రెండుసార్లు కంటతడి కూడా పెట్టుకుంది! ఆ రాజేశ్వరి ఎవరో మరి?

మా అమ్మమ్మ వచ్చిన రాత్రే గుళ్ళో కళ్యాణం, సోమేశ్వరస్వామికి అమ్మవారికీ కళ్యాణం అర్ధరాత్రి ఎప్పుడో జరుగుతుంది. నన్ను తీసుకు వెళ్ళకుండా వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. ఉదయం లేచి నా పనులు చూసుకొని, హైస్కూలుకు వెళ్లిపోయాను. ఆవేళ సాయంత్రం... నేనప్పుడే స్కూలు నుంచి వచ్చాను. ''ఒరే కుర్ర నాగమ్మా... ఇలా రా! అంది అమ్మమ్మ. నన్ను నాగమ్మా అనడం ఎందుకో? ఆ మాటకి అర్థం ఏమిటో నాకిప్పటికీ తెలియలేదు... 'తీర్థంలోకి వెళ్ళి ఏమైనా కొనుక్కోవురా!'' అంది.

''ఎందుకూ?'' అన్నాను బుంగమూతి పెట్టి. నన్ను లేపి కళ్యాణానికి తీసుకెళ్ళలేదని నాకసలే ఆరోజంతా కోపంగా వుంది.



''అదేమిట్రా అలాగంటావు? ఓరి వెర్రి నాగమ్మా!.... దేవుడి పెళ్ళి అయింది కదురా మరి!.... కుర్రాళ్ళంతా అవీయివీ కొనుక్కొని సరదాగా ఉండాలి అంది అమ్మమ్మ.

''నన్ను తీసుకువెళ్ళారేమిటి మహా! నేను కళ్యాణం చూశానా ఏమన్నానా? నేనేం కొనుక్కోను!'' అన్నాను కోపం యింకా పోనట్టు...

''ఓరి అదా? నీ అఘాయిత్యం కూలా! నువ్వింకా కుర్ర నాగమ్మవి కదురా, నిద్ర లేపితే జబ్బు చేస్తుందని మేమే వెళ్ళాం రా! అంతే! కోపగించుకో కూడదు. మేమంటావా పెద్దవాళ్లం! నిండా ములిగినవాళ్ళకి చలేమిటని!'' అంటూ జానికమ్మగారు కోక కొంగుకి ముడివేసుకొని రొంటికి దోపుకున్న మూట విప్పింది. ఒక రూపాయి నా చేతిలో పెట్టింది!

''అమ్మ బాబోయ్! రూపాయెందుకమ్మమ్మా!'' అన్నాను పెద్దగా ఆశ్చర్యపోతూ!

''ఏడిశావు లేవోయ్! తీసుకో! పెద్దవాడవవుతున్నావా, పెద్ద క్లాసుల్లోకి వస్తున్నావా? వెధవ రూపాయికేముందిరా... తీసుకో బాబూ!'' అంటూ కుడిచేయి గెడ్డానికి తగిలించింది. మళ్ళీ తనమాట అంటుందేమోనని – చప్పున తీసేసుకున్నాను.

అమ్మమ్మ మాటలింకా నాకు పూర్తిగా అర్థంకాలేదు. కాని ఆవిడ

మాట్లాడే తీరు – చక్కగా పాడుతున్నట్లుండేది. ఆమె గొంతు నా గుండెల్లో గిరి గిరాలు తిరిగేది. ఏవో రంగురంగుల బొమ్మలు కన్నుల ముందు కదలి పోతు న్నట్లుండేది!

ఆమె ఎప్పుడూ నిర్విచారంగా, ధీమాగా గడిపేది! డబ్బూ దస్కం అంటే వీసమెత్తు ఖాతరు లేనట్లే ఉండేది! కాని ఎందుకో ఆ ఊతపదం ఉచ్చరిస్తున్న ప్పుడు మాత్రం ఆమె అందమైన కన్నుల వెనుక దిగులు క్రీ నీడలేవో తారట్లాడు తున్నట్లే అన్పించేది. పచ్చని నుదురుమీద నల్లని మబ్బుతునక ఏదో కదిలిపో తున్నట్లు కనిపించేది. అవి నిజంగా దిగులు నీడలేనని, గుండెల్లో ఉండచుట్టు కొని వున్న దుఃఖాన్ని ఊది పారెయ్యడానికే అమ్మమ్మ అస్తమానూ ఈ ఊతప దాన్ని ఉచ్చరిస్తుందనీ, పోల్చుకుందుకు మరో ఆరేళ్ళు పట్టిందేమో నాకు!

అమ్మమ్మ అచ్చంగా రూపాయి నాచేతిలో పెట్టిందా! నాకు మాత్రం పూర్తిగా ఖర్చు చేయడం యిష్టమవలేదు. మా ప్రక్కింటి శంకరం, నేనూ తీర్థంలోకి వెళ్ళాం. అంతా తిరిగాం. ఇద్దరికీ చెరో పావలా ఖర్చు పెట్టాను. తీర్థంలో ఏము న్నాయి? రోజూ మా బజారులో కనిపించే వస్తువులే! పైగా చదువుతున్నది ఫస్టుఫారమైనా అప్పటికే నా మీద పెద్దరికపు మేలి ముసుగు కప్పబడుతోంది. ఏ ఆటవస్తువూ కొనుక్కోవాలనిపించలేదు. తిరిగి ఇంటికివచ్చి మిగిలిన అర్ధరూ పాయీ అమ్మమ్మ చేతికివ్వబోతే – తిరిగి తనకివ్వగూడదంటుందే గాని, ససే మిరా పుచ్చుకోలేదు! పైగా....


''ఇదేమిటేవ్ సుశీలమ్మా? నీ కొడుకు – డబ్బులిస్తే ఖర్చు చేసుకోవడం చేత గాని పెయ్యమ్మ పుట్టాడేమే! ఇలాగైతే ఎలా బ్రతుకుతాడమ్మా? మగవాడు! బాగానే తయారుచేస్తున్నావు వాడ్ని...'' అంది అమ్మమ్మ దీర్ఘాలు తీస్తూ!

అమ్మ ఒకటే నవ్వు. ''అవును పిన్నీ! వాడేమీ బయట కొనుక్కోడు... కావల సిందేదో నేనే చేసి పెడతానుగా!'' అంది సంబరపడిపోతూ అమ్మ. అమ్మమ్మ మాత్రం – నన్ను పొగుడుతోందో, నిజంగా నా చేతకాని తనానికి తిడుతోందో నాకు తెలియనేలేదు. తెల్లబోతుంటే అమ్మమ్మ నన్ను తన దగ్గరగా లాక్కుంది. గడ్డం క్రింద చేయిపెట్టి గట్టిగా నొక్కి ముద్దు పెట్టుకుంది. ''ఏం రా అయ్య వార్లూ?'' అంటూ పకాలున నవ్వింది. నవ్వు అంటే అమ్మమ్మదే నవ్వు! ఎంత బాగుంటుందని? సముద్రపొడ్డున చంద్రోదయంలా మొగమంతా పరచుకొని పరవళ్ళు త్రొక్కుతుంది. చూడటానికి నాకెంత హాయిగా ఉంటుందో?

***

శివరాత్రి సంబరం ముగిసింది. అమ్మమ్మ ప్రయాణమింక దగ్గరపడింది. ఒకనాటి ఉదయమే అకస్మాత్తుగా మా అమ్మ అడిగింది. ''అవును గాని పిన్నీ! ఈ వయసులో ఇలా నువ్వు ప్రయాణాలు చేయకపోతే నా దగ్గరుండి పోకూడ దమ్మా నీ చాదస్తం గాని! అసలే నీకు నీరసం.. అందులోకే ఈ మధ్య సుస్తీ! ఎందుకు చెప్పు...'' అంది అమ్మ ఎంతో ఆప్యాయంగా.. ఎంతో ఆర్ద్రంగా!

వెంటనే అమ్మమ్మ అందుకొంది – ''అదేమిటే... అలా అంటావ్. నువ్వు ఒక్కర్తెవే కూతురువా? ఏమన్నానా? నీలాంటి పదిమంది కూతుళ్ళు. జమాజెట్టీ ల్లాంటి నలుగురు కొడుకులు! మీ అందరికీ నేను కాకపోతే ఎవరున్నారే? అంద రినీ ఒక కంట చూసుకోకపోతే ఎలా చెప్పమ్మా!'' అంటూ కన్నుల నిండా కరుణ




కురిపించింది. అమ్మమ్మ కళ్ళు – మంచు బిందువులానిన గులాబి పువ్వుల్లా మెరిశాయి!

''నిజమేననుకో! కాని నీకు ఓపికేదమ్మా?''

''నాకు ఓపికేమిటే, నీ పిచ్చిగాని! పిచ్చుకకున్న ఓపిక పిచికుంటే – ఏనుగు కున్న ఓపిక ఏనుక్కీ ఉంటుంది! ఐనా నాకేమొచ్చిందనీ?''

''అదికాదు పిన్నీ... నా దగ్గరే విశ్రాంతిగా ఉండి, నాచేత సేవ చేయించు కుంటే పోలేదూ?'' అంది అమ్మ!

''ఏమిటోనే – నా పిల్లలంతా అలాగే అంటారే! కాని ఎవరినీ చూడకపోతే ఎలా గడుస్తుంది నాకు! అయినా నీ ప్రేమగానీ – నిండా మునిగిన వారికి చలే మిటే?'' అంటూ తుంపేసింది అమ్మమ్మ.

అమ్మమ్మ అస్తమానూ అనే ఆ మాట ఉత్త ఊతపదమే అనుకొనే వాడిని! దానినిండా బరువూ బాధ ఉందని నాకు తెలియదు. ఆ చివరి మాటతో అమ్మమ్మ అలా తుంపేసరికి – అమ్మ కన్నులొక్కసారిగా జలజల నీరు కురి పించ నారంభించాయి. అప్పుడు కొంత తెలిసింది నాకు!

అమ్మమ్మ కొండంత ధైర్యంగా గొంతు సంబాళించుకుంది. ''ఛా... వెర్రి మొహమా? అలా కంట తడిపెట్టుకోవచ్చా? నేనుండగా!.... ఐనా నాకేమొచ్చిం దమ్మా? నీ వెర్రిగాని!'' అంటూ అమ్మ చుబుకం మృదువుగా పుణికింది. ముద్దు పెట్టుకుంది అమ్మమ్మ.

పెద్దవాళ్ళని పెద్దవాళ్ళే ముద్దుపెట్టుకోవడం అంతకుముందు నేనెప్పుడూ చూడలేదు. వాళ్ళ సంభాషణ నాకు అర్థమైనట్లే వుందిగాని, వివరించుకుంటే ఏమీ బోధపడలేదు. ఎంతో విచిత్రంగా మాత్రం తోచింది నాకు. మళ్ళీ అమ్మమ్మే అందుకుంది – ''నా మాట నమ్ము వెర్రి తల్లీ – నాకు చావురాదే! గాభరా పడతావెందుకే నా తల్లీ! నేనేమీ చెయ్యాలో ఎప్పుడు కనుమయ్యాలో ఆ మహారాజే నిర్ణయించి వెళ్ళి పోయారే!''

''ఏమిటా మాటలు పిన్నీ? చావు గురించి ఎవరన్నారిప్పుడు?...''

సరిగ్గా యీ మాటలు మా అమ్మ అంటున్నప్పుడే – బయటనుంచి 'వాసూ! వాసూ! అంటూ కేకలు వినిపించాయి. ఒక్క పరుగులో వీధిలోకి వచ్చాను. ఇంకెవరు శంకరంగాడే! పెద్ద రాచకార్యం మునిగిపోతున్నట్లు ఎందుకు? వాడ్ని పంపేసి ఎంతో ఆదుర్దాతో యింట్లోకి వచ్చాను. మా అమ్మ వంటపని చూసు కుంటోంది. అమ్మమ్మ కుంపటి మీద గారెలు వేసుకుంటోంది.

ఇద్దరూ మౌనం గానే ఉన్నారు. ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు. ఫలహారం చేసి కాఫీ తాగింది అమ్మమ్మ. ''నేనలా దేవాలయానికి వెళ్ళి కళ్యాణ మూర్తిని దర్శనం చేసుకు వస్తానే... తొందరగానే వచ్చేస్తాలే!'' అంది.

అమ్మ ఏమీ మాట్లాడ లేదు. నిలువుగుడ్లతో చూసింది. ''ఆనక వెడుదుం కాదుటే పిన్నీ!'' అంది యథాలాపంగా. అమ్మమ్మ జవాబు చెప్పనేలేదు.

అప్పుడే నేల వదిలి గాలిలోకి ఎగరబోతున్న రాజహంసలా ఠీవిగా కదిలి పోయిందమ్మమ్మ.

***

నాకేమీ తోచిందికాదు. పుస్తకం పట్టుకున్నానే కాని కన్నులక్షరాల మీద వాలడం లేదు. చేతిలో పుస్తకం మాటే మరచిపోయాను. అమ్మ దగ్గర కూర్చు న్నాను. అమ్మమ్మ జీవితం ఒక రహస్య మందిరంలా తోచింది. అమ్మనడిగి తెలు సుకోవాలనిపించింది. తీరా అడిగితే చెబుతుందో! నీకెందుకివన్నీ అంటూ కసు రుతుందో! ఏమైనా ఉండబట్ట లేకపోయాను. ఎలా అడగాలో ఆలోచించాను. ఆమె ఏదో ఆలోచనలో కొట్టుకుంటోంది. ''అమ్మా!'' అన్నాను తటపటా యిస్తూ!

''ఏం బాబూ!'' అంది అమ్మ. కంఠంలో చిరాకు లేదు. ఏదో బరువు మాత్రం జీరగా పలుకుతోంది.

''అమ్మమ్మకి పదిమంది కూతుళ్ళా అమ్మా?'' అన్నాను.

''అబ్బే! అదికాదురా బాబూ! అమ్మమ్మకి అసలు సొంత పిల్లలు లేనే లేరు. అంతా నాకులాగా స్నేహితులే!''

''మన యింటికెప్పుడూ వాళ్ళు రారేం?... అమ్మమ్మ నీ కచ్చంగా పిన్ని కాదా?'' అంటూ ఆదుర్దాతో ప్రశ్న మీద ప్రశ్న వేశాను!

''కాదురా బాబూ! అమ్మమ్మ భర్త తాతయ్య గారు చనిపోయే సరికి అమ్మ

మ్మకి ఇరవై రెండేళ్ళు! ఆయన ముప్ఫయ్యో ఏడు రాకుండానే చనిపోయారు. అమ్మమ్మని ఆయన పువ్వుల్లో పెట్టి చూసుకొనేవారు. అమ్మమ్మకి పదెకరాల మాగాణీ భూమి, తునిలో ఒక ఇల్లూ వ్రాసి ఇచ్చారట. ఇష్టమైతే ఎవరినేనా దత్తు చేసుకోమన్నారట. తాతగారంటే అమ్మమ్మ కెంతో ప్రేమ. ఆయన పోయిన నాటి నుంచీ అమ్మమ్మ దేవతలా బ్రతుకుతోంది..'' ఏ కళను ఉందో గాని అమ్మమ్మ కథ సాధ్యమైనంత వివరంగా చెబుతోందమ్మ!

''తాతయ్యగారు పోయిన నాటినుంచీ అమ్మమ్మ ఆయన్నే ధ్యానిస్తూ తనకు నచ్చిన వాళ్ళనందరినీ తన పిల్లలుగా ప్రేమిస్తూ ఇంతకాలమూ నిష్కళంక పవిత్ర జీవితం గడుపుతోందమ్మమ్మ. యిప్పుడమ్మమ్మకి డబ్భై అయిదో ఏడు. అయినా తన పిల్లల దగ్గరకు మామూలు సంచారం మానదు. తనకు తాతగారిచ్చిన మాగాణీ పదెకరాల మీద వచ్చే ఆదాయం తన బిడ్డలందరికీ పుష్కలంగా ఖర్చు చేస్తుంది. కూతుర్ని కని తన పినతల్లి చనిపోతే – లక్ష్మీదేవమ్మను పెంచి పెద్దచేసింది. యుక్త వయస్సురాగానే తగిన వరుడ్ని వెదికి పెళ్ళి చేసింది. ఆ లక్ష్మీదేవమ్మను మొదటి కూతురుగానూ, ఆమె భర్త లక్ష్మీపతిగారిని మొదటి కుమారుడు గాను స్వీకరించింది. లక్ష్మీపతిగారు యోగ్యుడే గాని సంపన్న కుటుంబానికి చెందినవాడు కాదు. ఆయనకోసం కొంతభూమి అమ్మి ధాన్యం మిల్లు పెట్టించింది. అదే తునిలో మొట్టమొదటి మిల్లు. ఆయన వ్యాపారంలో బాగా లాభాలు సంపాదించి – అమ్మమ్మ యింటిని మేడగా మార్చాడు. మేడ పైఅంతస్తు అమ్మమ్మే వాడుకుంటుంది. లక్ష్మీపతిగారు సంపత్తి తామరతంపరగా పొంగింది. ఆయనిప్పుడు మరో నూనిమిల్లు కూడా పెట్టారు. తునిలో విపరీతమైన పేరు ప్రతిష్టలూ ఆర్జించారాయన. ఇంతచేసినా తన యింటిని తన సొంతంగా ఆయన ఎప్పుడూ భావించరు. జానికమ్మ గారి ఆజ్ఞ పొందనిదే ఏ పనీ చేయడు. వారికి మొదట అమ్మాయి పుట్టింది. జానికమ్మగారి పేరే పెట్టుకొని అల్లారు ముద్దుగా పెంచుతున్నారు.

అమ్మమ్మ మరో కూతురు గునిపూడి భీమారంలో వుంది. ఆమె దూర బంధువు; అంటే తాతయ్యగారి పెదతండ్రి కుమారుడి ఏకైక కుమార్తె. ఆమె పెళ్ళినాటికే తండ్రి, సవతి తల్లి చెప్పినట్టల్లా చేసి ఆస్థి పాడుచేశాడు. ఆ కూతురు పెళ్ళికూడా జానికమ్మగారే చేసింది. ఇలాగే అమ్మమ్మ కూతుళ్ళంతా తలో వూరిలోనూ ఉన్నారు.''.

''అమ్మా! మరి నువ్వెలా కూతురివయ్యావు?'' అని ఆశ్చర్యపోతూ అడిగాను.

''ఏముంది? మా నాన్నగారికీ లక్ష్మీపతిగారికీ ప్రాణ స్నేహం! మా నాన్నగారి సలహా తీసుకోందే లక్ష్మీపతిగారేపనీ చేసే వారు కాదు. మనం భీమవరపుకోట వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ తునిలో వారింట మకాం చేసుకొనే వారం. పైగా నేను ఏడాది వయసు పాపగా ఉన్నప్పుడే మా అమ్మ పోయింది. అప్పుడు జానికమ్మగారు మా నాన్నగారినోదార్చడానికి అక్కడికి వెళ్ళారు. 'అప్పారావూ! నువ్వేం దిగులు పడకు. చక్కగా మళ్ళీ పెళ్ళిచేసుకో! చంటిదాని సంగతంటావా? నువ్వు కన్నావేగాని – ఈరోజు నుంచీ అది నా కూతురు! దాని సంగతి నేను చూసుకుంటా!' అందట అమ్మమ్మ! అమ్మమ్మకి మా నాన్నగారు రెండో కొడుకూ, నేను మూడో కూతుర్నీ! అంది అమ్మ! మరింత ఆశ్చర్యం కలిగింది నాకు. అప్పటి మనుషులూ, వాళ్ళ మమకారాలు ఎంత విచిత్రమో!

అమ్మమ్మా మేమూ ఒక శాఖ వాళ్ళమైనా కామని నాకు మరికొంత కాలానికి గాని తెలియలేదు. ఎప్పుడూ చేతిమొయ్యా డబ్బూ... పది మందికీ తానే ఖర్చు చేయడమే తప్ప – ఎవరి దగ్గర్నుంచీ ఒక్క నూలు పోగయినా తీసుకుని యెరుగదు అమ్మమ్మ! మనిషి బక్కపల్చగా పీలగా ఉండేదా – కాని ఆవిడ ప్రేమ మాత్రం ఆకాశమంత విశాలం!

''ఆ మహారాజు నాకింత ఆస్థి యిచ్చి వెళ్ళిపోయారా? ఇంతమంది పిల్లల్నీ

## ఎందువల్ల నచ్చింది అంటే...



ఇది నేను చాలా కష్టపడి రాసిన కథ. జానికమ్మ నాకు తెలుసు. 20 యేళ్ళకే వైధవ్యం ప్రాప్తించిన దురదృష్టవంతురాలు. సంతానం లేదు. చాలా నియమబద్ధమైన జీవితం గడిపింది. మానవ జీవితంలో తల్లితనం ఎంత గొప్పదో కదా. తనకు నచ్చిన వాళ్ళందరినీ తన పిల్లలుగా అభిమానిస్తూ పవిత్ర జీవితం గడిపింది. అంతర్లీనంగా నా రక్తగతమైన మదర్ ఫిక్సేషన్ ఉండనే ఉంది. కథ రాసే వరకు తట్టి కొట్టి సలిపింది!

**–ఆవంత్స సోమసుందర్**

***93478 48905***

భగవంతుడివ్వకపోతే ఏం చేసుకుందును? నాకు లోటేమిటి సుశీలమ్మ తల్లీ! నాకు పధ్నాలుగిళ్ళున్నాయి. ఎవరికీ ఏలోటూ లేదు. నాకేమిటి దిగులు.'' అంటూనే అమ్మమ్మ ఆవేళ కన్నీళ్ళు పెట్టుకుంది!

అమ్మమ్మ దేవాలయం నుంచి తిరిగి వచ్చేవరకూ మా అమ్మ ఆవిడ కథ చెబుతూనే వుంది. అమ్మో! అమ్మమ్మ కెంత పెద్దకథ ఉందో?.... అమ్మమ్మ వచ్చేసరికి మా యిద్దరి భోజనాలు అయిపోయాయి. సామానులు సర్దుకోవడం, ఇల్లు కడుక్కోవడం ముగించిందమ్మ.

వస్తూనే అమ్మమ్మ – ''అదేమీ తల్లీ! ఇంకా నడుం వాల్చలేదుటే?'' అంది.

''నీ కోసమే చూస్తున్నానమ్మా! ఇదిగో అయిపోయింది!'' అంటూ అమ్మ చేతులు తుడుచుకుంది. మా ముగ్గురికీ హాలులో వరసగా మంచాలు వాల్చి పక్కలు వేసింది. నా మంచం మీద పడుకుని నిద్రపోయినట్లు నటిస్తున్నాను.

కళ్యాణమూర్తుల అలంకరణ గురించి తన్మయత్వంతో వర్ణించిందమ్మమ్మ. దేవుడి కళ్యాణం గురించి చెబుతూంటే – తన పెళ్ళినాటి ముచ్చట్లు జ్ఞాపకం వచ్చాయి కాబోలు! చెప్పనారంభించింది. ''నిజమేనమ్మా''... దేవుడికళ్యాణం చూస్తుంటే నా పెళ్లే జ్ఞాపకం వస్తోంది సుమా! నాకప్పటికి పన్నెండో యేడు. అమ్మవారి విగ్రహంలా పొట్టిగా ఉండేదాన్ని. 'బంగారు తీగలా మెరిసిపోతోంది' అనే వారంతా! మీ బాబయ్యకి ఇరవయ్యో యేడు! పచ్చగా బంగారం కడ్డీలా మెరిసిపోయే వారు నిజంగా. ఎంత అందంగా వుండేవారని! గంగావతరణం బొమ్మ చూసావా? నడుముకి చేతులు బిగించి సిద్ధంగా నించుని ఉంటాడు ఈశ్వరుడు! అచ్చంగా అలాగే ఉండేవారే తల్లీ! పెళ్ళినాడు ఆయన్ని చూసినప్పుడే నా పంచ ప్రాణాలూ తీసి ఆయన పాదాల దగ్గర పెట్టేశానే అమ్మా! ఆ మహారాజు – ఎందుకో తెలియదు, ప్రాణం కన్నా తీపిగా చూసుకొనే వారు నన్ను! ఆయనంటే నాకెంత భక్తి తాత్పర్యాలో అంత చనువూను!... ఏదో చెప్పేస్తున్నాను – ఇంతకీ కుర్ర నాగమ్మ పడుకున్నాడా?'' అంది అమ్మమ్మ.

కళ్ళు గట్టిగా మూసుకుని దొంగనిద్ర నటిస్తున్నాను ఒళ్ళు కదపడం లేదు. నిద్రకీ దొంగ నిద్రకీ తేడా ఉంటుందేమో! అమ్మమ్మకి తెలిసి పోతుందేమో నని పించి నవ్వు వచ్చింది అమ్మో! ఎలా నవ్వడం? అమ్మ నన్నొకసారి పరీక్షగా చూసింది. ''వాడికెప్పుడో నిద్ర పట్టేసిందమ్మా!'' అంది. 'పోనీలే వెర్రి నాగమ్మ' అనుకుంటూ తృప్తి పడిందమ్మమ్మ.

''అవును గాని పిన్నీ! బాబయ్య గారితో దాంపత్య జీవితం సుఖంగా గడిచిందా?''

''హవ్వ! అదేమిటో అలా అడుగుతావు? రామాయణమంతా విని రాముడికి సీత ఏమవుతుంది – అన్నట్లుందే వెర్రి తల్లీ?'' అంటూ అంత జ్ఞాపకాల దుఃఖ భారంలోనూ హాయిగా నవ్వింది అమ్మమ్మ.

క్షణం ఆగి మళ్ళీ చెప్పనారంభించింది; ''ఆ మహారాజు ఆజ్ఞ కాలేదు కనక ఇలా బ్రతుకుతున్నాను కాని, లేకపోతే ఆయనతో పాటే, చితి ఎక్కి ఉండే దాన్ని కాదుటే?... ఏమిటో మనం అనుకుంటాం గాని, మన చేతిలో ఏముందే అమ్మాయి? ఇంతమంది పిల్లల్ని భగవంతుడు నాకు అప్పగించాల్సి ఉండగా తప్పించుకోవడం నా తరమా చెప్పు?''

అమ్మ ఏమీ చెప్పలేదు. ఏమాలోచించుకొంటోందో అమ్మమ్మ కూడా మాట్లాడలేదు. కాని మౌన క్షణాల నిండా అమ్మమ్మ తేజస్సు వెలిగి పోతోంది. శూన్యం నిండా అమ్మమ్మ తేజస్సే ప్రసరిస్తోంది.

***

అమ్మద్వారా విన్న అమ్మమ్మ సంగతులు నాకిప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తూనే ఉంటాయి. భూమిమీద వచ్చే కొద్దిపాటి ఆదాయం ఆవిడ ఖర్చులకు చాలలేదు. పదెకరాల మాగాణీ క్రమంగా అమ్ముకుంటూ వచ్చింది. ఇక మూడెక

రాలు మిగిలింది. పదిమంది కూతుళ్ళలోనూ ఎవరింట ఏ పురుడూ పుణ్యం వచ్చినా ఒక కార్డు ముక్క రాస్తే చాలు; చేతిములగా డబ్బు తీసుకుని బయల్దేరేదమ్మమ్మ. ఆ పుట్టినపాపకి, ఆడా మగా విచక్షణ లేకుండా వెండి బంగారు వస్తువులు పెట్టేది. అందుకే యిప్పటికి ఏడుగురు జానికమ్మలు వెలిశారు. ముగ్గురు జానకిరామ్‌లూ పెరుగు తున్నారట! మొత్తానికమ్మమ్మ ఒక పెద్ద కుటుంబానికి మూల విరాట్‌గా రూపొందింది!

ఆ వేళ తెల్లారగట్లే లేపేసిందమ్మమ్మ! మహాశివరాత్రి మరి. తూరుపు తెలవారకముందే స్నానాలకి బయల్దేరాం. ఐనా అప్పటికే జనం బాగా కమ్మేశారు. నేనూ అమ్మమ్మా నలిగిపోకుండా చూడటమే అమ్మకి బ్రహ్మ ప్రళయమైంది. స్నానాలు అభిషేకాలు, పూజలు సజావుగా జరిపి యింటికి వచ్చేసరికి పది గంటలైంది. ఆవేళ అమ్మా అమ్మమ్మా ఉపవాసం! అమ్మమ్మ ఆ నాలుగు గారెలూ తినడం కూడా మానేసింది. పాలు మాత్రం తాగింది. అమ్మ పెరుగు అటుకులు తింది. నేనూ ఉపవాసముంటానని సరదా పడితే యిద్దరూ ఖియ్యిమన్నారు. నా కోసం వండి పెట్టింది అమ్మ!

పాలు తాగిన అమ్మమ్మ జపంలో కూర్చుంది. లేచేసరికి మూడు గంటలైంది. అస్తమయం వరకూ అమ్మమ్మ శివధ్యాన్యంలోనే వుంది. కీర్తనలూ, శ్లోకాలూ చదువుకుంటూనే వుంది. ఆవేళ సూర్యుడు గొప్ప ప్రకాశవంతంగా వెలిగిపోతున్నాడు. అంత కన్న అమ్మమ్మే ప్రకాశ వంతంగా మెరిసిపోతోంది!

నడుములు వాల్చేసరికి రాత్రి పదిగంటలైంది. మాటలు సాగడం లేదు. అందరూ మౌనంగా ఉన్నాం. ''ఏమే అమ్మాయీ? కునకు పట్టిందేం?'' అంది అమ్మమ్మ.

''అబ్బే – లేదమ్మా! నీ జీవితం గురించే ఆలోచిస్తున్నాను!''

''అదేమిటేవ్? నీ వరస బాగుందమ్మా! నా గురించి ఆలోచనేమిటే వెర్రి తల్లీ? నా కంటె సుఖమూ ఆనందమూ ఎవరికుందే ఈ లోకంలో! నాకా భగవంతుడి గురించీ – ఆ మహరాజు గురించీ తప్ప చింతేముంది? ఆయన నాకు పిల్లల్నివ్వక పోతేనేం – భగవంతుడు యింతమంది మంచి వాళ్ళని సంతానంగా ప్రసాదించాడా? ఇక నాకు లోటేమిటి?'' అంది అమ్మమ్మ దీర్ఘాలు తీస్తూ – కొండంత ధీమాగా!

''నీకు లోటేమిటే పిన్నీ? అదికాదు.. నీ జీవితం గురించి తల్చుకుంటూంటే.. అంటూ అమ్మ ఆర్ద్రోక్తిగానే ఆపేసింది.

అమ్మమ్మ వెంటనే అందుకుంది. అసలలాంటి వాక్యాలు పూర్తి కావడం ఆమెకెప్పుడూ ఇష్టం ఉండదేమో?

''బాగుందే – నీ యిల్లు బంగారం గానూ! నా గురించే ముందే? ఐనా నిండా మలిగినవారికి చలేమిటి? నీ చాదస్తం గాని'' అని గంభీరం గానే అందా, ఇంతలో గొంతు జాలిగా మారింది. భగవన్నామస్మరణ చేసుకుంటూ నిద్రపోయింది.

ఆమాటు ఎన్నో రోజులుండలేదు. మరో నాలుగు రోజుల్లో బయల్దేరింది.

అమ్మతో తన ప్రయాణం గురించి అమ్మమ్మ ఏవేవో వివరిస్తూంటే అకస్మాత్తుగా నాకు వెక్కివెక్కి ఏడుపు వచ్చింది. 'వెళ్ళిపోకమ్మమ్మా' అంటూ నా ఏడుపు రాగాలలోకి మారింది. ఈ మాటు ఎందుకలా ఏడుపు వచ్చిందో నాకే తెలియదు. అమ్మమ్మ నన్ను దగ్గరకు తీసుకుంది. ''మళ్ళీ త్వరలో వస్తాను గదురా, చిట్టితండ్రీ! ఏడవకమ్మా!'' అంది. నా ఏడుపు తగ్గలేదు. ''ఒసే అమ్మాయీ వీడికి మంచిబట్టలు కుట్టించవే! ఇంద!'' అంటూ పది రూపాయలు తీసి యిచ్చింది. ఎందుకమ్మా – నేను కుట్టిస్తాలే!'' అంటూనే పుచ్చుకుంది అమ్మ. తీసుకోకపోతే నానా గొడవ చేసేస్తుంది అమ్మమ్మ. అమ్మమ్మ వెళ్ళిపోయింది. కాని యేడుపు తగ్గలేదు.

***

అమ్మమ్మ తరచు వస్తూనేవుంది. ఒక్కోసారి నెల రోజులు వరకూ ఉంటూనూ ఉంది. ఎప్పుడు వచ్చినా తనతో కూడా ఎంతో వెలుగూ సువాసనా తెస్తూనేవుంది. అవును; అమ్మమ్మ హారతి కర్పూరం వంటిది. తనంత తానే హుతమై పోతూ, వెలుతురూ పరిమళమూ ఇతరుల కందిస్తుంది. ఆ అదృష్టం కొద్దిమంది దేవతామూర్తులకు మాత్రమే లభిస్తుంది. అమ్మమ్మ నిస్సందేహంగా దేవత!


ఈమాటు రావడం మాత్రం నా జన్మలో మరచిపోలేదు. కార్తీకపౌర్ణమి నాలుగు రోజులుందనగా వచ్చింది. వస్తూనే అమ్మతో – ''కుర్ర నాగమ్మ పుట్టిన రోజుకదా అని అర్జంటుగా వచ్చేశానే!'' నా పుట్టిన రోజు గురించి అమ్మమ్మ కెంత జ్ఞాపకమో!'' అమ్మ అదే అంటూ హాయిగా నవ్వింది.

మళ్ళీ అమ్మమ్మ అంది. ''ముందు బెజవాడ వెళ్ళి సీతాపతిశాస్త్రి దగ్గర నాలుగు రోజులు గడుపుదామనుకున్నాను. తర్వాత దారిలో కామేశ్వరిని, సత్యవతినీ, వర్ధనమ్మనీ చూసి తర్వాతనే నీదగ్గరకు వద్దామనుకున్నాను...'' అంటూ నన్ను దగ్గరకు పిలిచింది. అప్పుడు చూశాను. ఎందుకనో అమ్మమ్మ కొంచెం చిక్కింది. అయినా మరింత తెల్లగావుంది. మరింత కాంతిగా మెరిసిపోతోంది. మనిషి మాత్రం నిలుచున్న తడపలా నీరసంగా తడబడుతోంది. ఈమాటు ఎప్పుడూ తెచ్చుకొనే నల్లరంగు ట్రంకుపెట్టె తేలేదు. చేంతాడు బిగించీ లేదు. విజయనగరం వెదురుబుట్టా లేదు; చేతి సంచి లేదు. అన్నిటికీ మారుగా ఒక మంచి తోలు సూటు కేసు, ఒక పేము సజ్జా ఉన్నాయి.

''ఇదేమిటమ్మమ్మోయ్! పెట్టె మార్చేశావే!''

''ఔనురా; కనిపెట్టావూ'' అంటూ అమ్మవైపు తిరిగింది. ''ఆ లక్షింపతికి నా పాతపెట్ట చూసి అభిజాయిత్యం తోచింది కాబోలు – ఇది నాకోసం తెచ్చి ఏడాదయింది. శతపోరుతున్నాడు. ఈ మాటు పట్టుపట్టేశాడేవ్! అవునూ, వేడినీళ్ళు ఉన్నయ్యో? పడెయ్యాలా? త్వరగా చూడు. మనకి బోలెడు పనుందీ వేళ?'' అంది అమ్మమ్మ. ఏమిటా పని అని అమ్మ అడగ లేదు. ఎక్కడ్నించీ వస్తున్నదీ అడగలేదు. విశేషాలేమిటనీ అగడ లేదు. వచ్చీరాగానే బండివాడి నుంచి సామానులు పుచ్చుకొని లోపల బల్ల మీద పెట్టింది. అలవాటుగా ఒంగి అమ్మమ్మ పాదాలకు నమస్కరించింది.

ఈ మాటు మళ్ళీ అమ్మమ్మ దృష్టి నామీద ప్రసరించింది. ''బాబూ! నీకు పదహారో యేడు వస్తోంది తెలుసా? బాగా చదవాలి; గొప్ప మార్కులు తెచ్చుకోవాలి. స్కూల్ ఫైనల్‌లో ఫస్టుగా ప్యాసవ్వాలి! గొప్ప చదువులు చదవాలి. గొప్పవాడివి కావాలి. నీవు పెద్దవాడివవడం నేను చూడను. నేను లేకపోయినా నా మాట జ్ఞాపకం ఉంచుకోవాలి సుమీ! నువ్వేం చేసినా ఎలా ఉన్నా – నీమీద నీకు విశ్వాసం పెరిగే రీతిగా నడచు కోవాలి... తెలిసిందా, ఊc... '' అంది.



## కరీనా చేతిలో ఐసు ఔట్!

ఆటలో గెలుపు ఓటములు సహజం. అదే విధంగా సినీ ఫీల్డులో కూడా. కాకపోతే ఓ అందగత్తె చేతిలో మరో అందగత్తె ఓటమి పాలయింది. అదెలాగంటే...

కరీనా నటించిన 'గోల్‌మాల్-3', మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్య నటించిన 'యాక్షన్ రీ ప్లే' చిత్రాలు రెండూ ఓకే రోజు విడుదలైన సంగతి తెలిసిందే! అయితే ఐశ్వర్య నటించిన చిత్రం కన్నా కరీనా నటించిన చిత్రమే బాలీవుడ్ అభిమానులకు తెగ నచ్చేసిందట! 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందంగా అందాల రాణిగా ఎంత పేరున్నా, ఇటీవల చిత్రాల సక్సెస్‌లో మాత్రం ఐశ్వర్య చాలా వెనుకబడిపోయింది. ఈ నేపథ్యంలో వచ్చిన 'రోబో' కొంత ఉపశమనాన్ని ఇచ్చినా తిరిగి 'యాక్షన్ రీ ప్లే' మటుకు పాత చిత్రాల ఖాతాలోకి వెళ్ళిపోయింది అని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. తన చిత్రం సక్సెస్‌తో కరీనా పండగ చేసుకుంటుండగా, ఐశ్వర్య మాత్రం తన తరువాతి చిత్రం 'గుజరాయిష్' మీద బోలెడు ఆశలు పెట్టుకుంటోంది. ఈ చిత్రం అన్నా ఐశ్వర్య కోరిక తీరుస్తుందో లేదో!

నిజానికి ఆవిడ మాటల అంతరార్థం నాకంత బాగా తెలియలేదు. ఏం చెప్పాలో తోచలేదు. సందేహంగానే తలాడించాను. మళ్లీ ఆవిడ అందుకుంది. "నీకు సరిగా తెలియలేదు కదూ! వెర్రి నాగమ్మా ఆ మాట చెప్పడానికి సిగ్గేం? వెంటనే అర్థం కాకపోయినా ఫరవాలేదు. ఆమాట మాత్రం జ్ఞాపకం పెట్టుకుంటివా అనుభవంలో అదే తెలిసి వస్తుంది!" అంది. ఇంతలో అమ్మ మేమున్న హాలులోకి రావడం చూసింది; "ఏమమ్మా! నీళ్ళు..."

"కాగే ఉన్నాయి పిన్నీ - స్నానానికి లే!"

"నువ్వు కూడా రా; సాయం చేదువుగాని, కొంచం నీరసంగా ఉంది".

ఈ మాటు అమ్మమ్మ నడతా, మాట్లాడే రీతి ఎంతో విచిత్రమైన మార్పు పొందింది. మాటలు ఎప్పుడూ లేనంత తొందరగా వస్తున్నాయి. ఇదివరకు తన పనులు ఎవరినీ ముట్టుకోనిచ్చేది కాదు. ఇదివరలో మాటలు తాపీగా, దీర్ఘాలుగా సాగేవి. ఇప్పుడో - ఆ సంగీతం అదృశ్యమైంది.

కాని ఒంటికి చందనతైలం పూసుకోవడం మానలేదు. తెల్లగా సూర్యకాంతిలా మెరిసే గ్లాస్కో పంచ కట్టుకోవడమూ మానలేదు. సజ్జలోంచి తన దేవుణ్ని బయటపెట్టి పూజ చేసుకోవడమూ మానలేదు. ఆ పనులన్నీ యథావిధిగా జరుగుతూనే ఉన్నాయి.

మరో డబ్బా తీసి అమ్మకిస్తూ - "అమ్మాయి ఇందులో సగ్గుబియ్యం ఉన్నాయి. పాలుతోటే ఉడికించి - బాగా ఉడికిన తర్వాత దింపి పంచదార వెయ్యి. నీళ్ళు పోయకు. నేను గారెలు కూడా మానేశాను, తెలుసా?.... ఎంతో ఒద్దు సుమీ! చిన్నగిన్నె లేదూ దానిలో పెట్టు! అదే ఒక పూట తింటాను" అంది.

"అదేమిటి పిన్ని - కాస్త పాయసం తిని ఎలా ఉంటావమ్మా!... వైద్యులింకేమీ తినకూడదన్నారా?"

"ఒకళ్ళు తినవద్దనేదేమిటే తల్లీ! నిండా మునిగినదానికి చలేమీటి?" ఆ కొస మాట అమ్మమ్మ అంటూండగా నేను లోపల్నించి హాలులోకి వచ్చాను. మామూలుగా దీర్ఘం తీసే సరికి నవ్వు వచ్చింది. నవ్వుతూ చూశాను. ఆవిడ కూడా నవ్వింది. "ఏం రా బాబూ, స్కూలుకి వెడుతున్నావా? పోనీ యీ నాలుగు రోజులూ మానేయ కూడదురా?"

"అబ్బే - ఎలా? పాఠాలు పోవుటే అమ్మమ్మా!"

"పోనీ ఇవేళకి మానెయ్యి! మనకి బోలెడు పని వుంది. బయటికి వెళ్లాలి!" అంది అమ్మమ్మ.

"సరిలే - అయితే వెళ్ళి పెందరాళే వచ్చేస్తాను!" అన్నాను.

అన్నట్లే పన్నెండు గంటలకే వచ్చేశాను. అమ్మమ్మ పీట మీద కూర్చుంది. అమ్మ భోజనం చేస్తూంటే కబుర్లు చెబుతోంది. నేను లోపలికి వచ్చాక విన్నమాటలు మాత్రం యివి: "మొన్న దసరా దశమినాడు మీ బాబయ్య తద్దినం కాదుటే! లక్ష్మీపతే పెడతాడు. ఆబ్దీకం అన్నమాటే కాని ఒక పెళ్ళిలా జరుపుతాడు. ఆవేళ బ్రాహ్మల భోజనాలయ్యాయి. నేను వారి ప్రసాదం రెండు గారెలు తిన్నాను. అంతే, స్మారకం తప్పి పడిపోయాను. మెలుకువ వచ్చాక తెలిసింది. ఆ మహారాజు స్వయంగా వచ్చి ఉపదేశం చేసి వెళ్ళారు. నాకింకెంతో వ్యవధిలేదు. వారి ఆజ్ఞ అయిపోయింది. రేపు మార్గశిర పౌర్ణమికి నాకు ఎనభై ఏళ్ళు వస్తాయి! వారి అబ్దీకానికి తిన్న రెండు గారెలూ తప్ప మళ్ళా ముట్టలేదు. ఒళ్ళు గూడా బాగుండటం లేదు. ఉన్న మూడెకరాలూ అమ్మేశాను. పదిహేను వేలు వచ్చింది. తక్కువే అనుకో! అయినా చాలా పనులు చేయాలి! నా పిల్లలందరికీ ఏర్పాట్లుచేయాలి! అంటూ సుదీర్ఘంగా చెప్పింది అమ్మమ్మ. అమ్మ ఊకొడుతోంది. హావభావాలు ప్రకటిస్తోంది. భోజనం ముగించింది. నాకూ అన్నం వడ్డించింది. అమ్మమ్మ మొగం చూస్తూ భోజనం చేస్తూంటే - నా మనసులో ఏవో మూగ వేదనలో, భావాలో తారట్లాడాయి!

బండి తెస్తానని ఎంత చెప్పినా వినక అమ్మమ్మ నడిచే వెడదామంది! అమ్మకిగాని - నాకుగాని - ఆవిడ మనసులో ఉన్న ఆ బోలెడు పనీ ఏమిటో తెలియదు. తిన్నగా బట్టల కొట్టు దగ్గరకు తీసుకు వెళ్ళింది. ఎంత వద్దన్నా వినకుండా నాకూ అమ్మకీ బోలెడు బట్టలు తీయించింది. మళ్ళీ మళ్ళీ పెట్టుకుంటానో లేదో నువ్వేమీ మాట్లాడకు అంటూ నోరు నొక్కేసింది.

"బాబు పెద్దచదువుల కెడుతున్నాడా - దొరలాగుండాలి" అంటూ అమ్మమ్మ నన్ను చూసి మరిపెంతో నవ్వింది. ఆవిడ మాట కాదనేదెవరు?

అమ్మమ్మకే ఆలోచనా కలిగినా ఎవ్వరూ ఆటంకపర్చలేరు. తోచినట్టూ చేయవలసిందే. మంచి దర్జీనీ పిలిపించింది. సూటు ఎలా కుట్టాలో పురమాయించింది. కొలతలు తీసుకోమంది. బట్టలు పట్టుకొని దర్జీ వెళ్ళిపోయాడు.

కొట్టుదిగుతూ అమ్మమ్మ అందికదా! "ఏమో సుశీలమ్మ తల్లీ! నువ్వేమీ మొహమాటపడకు. నీకేం కావాలో చెప్పు! రేపు మనదవునో కాదో... అయ్యో... యింకానా?.... నిండా మునిగినదానికి చలేమిటన్నట్టు!"

అమ్మ ఏమీ మాట్లాడలేదు.

"సరేనర్రా! తల్లికీ కొడుక్కీ సరిగ్గా సరిపోయింది. పదండి!" అంటూ మమ్మల్నిద్దరినీ ఆంధ్రా బ్యాంకుకు తీసుకు పోయింది. ఏజెంటుతో ఏదో మాట్లాడింది. నాకు తెలిసింది మాత్రం చాలా కొంచమే. నా పెద్ద చదువుల కోసమని పదిహేనువందలు బ్యాంకులో వేస్తోందని! అమ్మా, నేనూ కలిసి సంతకం చేస్తే తప్ప యివ్వరట! అంతే! ఇదంతా చూసి మా అమ్మ చెంగు మొగానికి అడ్డం పెట్టుకొని అక్కడే వెక్కి వెక్కి ఏడ్చేసింది. నేనేమీ అనలేదు. ఏమంటాను; అమ్మమ్మ చెప్పినట్లు కుర్ర నాగమ్మను!

"ఏమిటే తల్లీ - ఈ అట్టహాసం? నీకేమైనా మతిపోయిందా? పోనీలే నా మీద యిష్టం లేదేమో చెప్పు! మానేస్తాను. నా మనవడికి నేనామాత్రం పెట్టుకోతగనంటావా?.... అయ్యో రాత!...." అంటూ కొంచెం గట్టిగా దీర్ఘాలు తీసింది.

"ఏమిటో పిన్నీ! ఎందుకు చెప్పు యిదంతా!"

"అదిగో ఆ మాటే అనొద్దన్నాను. ఇంకేమన్నా అన్నావంటే - నా నోటినుంచి మంచి మాటలు రావు! తెలిసిందా? ఇంత బ్రతుకూ బ్రతికిన దాన్ని నా నోట చెడ్డ మాటలనిపించాలని ఉందా చెప్పు!"

"అది కాదు పిన్నీ - నీ ఋణం నేనెలా తీర్చుకుంటానమ్మా?!"

"ఛా ... తల్లికీ కూతురుకీ ఋణమేమిటే... పిచ్చి తల్లీ! అయినా నాదేముందే! ఆ మహారాజు ఆజ్ఞ ప్రకారమే చేస్తున్నాను... పదండి"

ఆ వేళ కార్తీక పౌర్ణమి. నా పుట్టినరోజు. నాకు పదహారేళ్ళు వచ్చాయో లేదో తెలియదు కాని - కావాలని ఆనాడే పుట్టినంత ఆనందంగా ఉంది. ఆ వేళ ఉదయం నుంచీ నా మనసు నిండా గొప్ప వెన్నెల కాస్తూనే ఉంది. అమ్మమ్మ మా పాలిటి సాక్షాత్తూ దేవతలా కనిపించింది. ఆమె బట్టలు కుట్టించినందుకూ కాదు; నా పేర బ్యాంకులో డబ్బు వేసినందుకూ కాదు! పెందరాళే ఆవేళ అమ్మమ్మే నన్ను నిద్రలేపింది. స్వయంగా అక్షతలు నా తలమీద వేసి దీవించి, నూనె పెట్టింది. నా తలంటు కార్యక్రమం ముగిసింది. దర్జీ తెచ్చిన కొత్తబట్టలు కట్టుకున్నాను. సూటు వేసుకుంటే కొత్త వేషం ఏదో వేసినట్లు నాకెంతో ముచ్చటగా ఉంది. "చూశావే! నీ కొడుకు అచ్చంగా దొరలాగే ఉన్నాడు! నాకు తెలియదుటే! నువ్వేదో అంటావు గాని? వాడి ఛాయకీ, అందానికీ ఎంత బాగా అమిరిందో చూడు!" అంటూ అమ్మమ్మ ముచ్చట పడిపోయింది! నాకు కావలసిన పిండివంటలు చేయించి పెట్టించింది.

మరో నాలుగు రోజులైనా ఉండమని ఎంత బతిమా

కవిత



## నేనెవరు?

*నిన్ను నీవు*
*దర్శించాలనుకున్న ప్రతిసారీ*
*తాత్కాలికంగా అదృశ్యమైపోవలసిందే*
*బంధాలను, అనుబంధాలను మూటనగట్టి*
*ద్రవరూప శిధిలాలుగా మార్చాల్సిందే!*

*నీలో నీవు*
*ప్రవహించాలనుకున్న ప్రతిసారీ*
*గతాన్ని నెమరు వేసి*
*వర్తమానాన్ని స్పృశించుకుంటూ*
*అలౌకిక స్పర్శకు లోనై*
*అనుభూతి చెందాల్సిందే!*

*నిన్ను నీవు*
*తెలుసుకోవాలనుకునే ప్రతిసారీ*
*ప్రకృతితో మమేకమై*
*మట్టితత్వం ఒంట బట్టించుకొని*
*శూన్యంలోకి తొంగి చూడాల్సిందే!*

**-పి.లక్ష్మణ్‌రావ్**
**94412 15989**

లినా వింది కాదు. "నా కింకెంతో వ్యవధిలేదుర్రా!" అంటూ పెట్టే బేడా సర్దు కుంది. మరునాడు మూడు గంటల బండికి భీమవరం బయల్దేరింది. వెళ్తూ అమ్మని దగ్గరకు పిలిచి రెండు వందలు చేతికిచ్చి – "ఇవి నీ దగ్గరుంచు తల్లీ! నేను మళ్ళీ వచ్చినప్పుడు తీసుకుంటాను" అమ్మ సందేహిస్తూనే పుచ్చుకుంది. చేతులు వణికాయి. కళ్ళు నీళ్ళు క్రమ్మాయి!

అమ్మమ్మ అదేం పట్టించుకోలేదు. నన్ను దగ్గరకు పిలిచింది. బుగ్గలు పుణి కింది. "నేను చెప్పిన మాటలు జ్ఞాపకం పెట్టుకుంటావు కదూ?" అంది. అంతే. మరేమీ చెప్పలేదు.

ఆ వేళ అమ్మమ్మని రైలెక్కించి వస్తూ అమ్మా నేనూ వెక్కి వెక్కి ఏడ్చాం. అది మొదలుగా నాకిప్పటికీ అమ్మమ్మని తల్చుకుంటే చాలు – కన్నులు తొలకరి మబ్బులై పోతాయి! అలా అమ్మమ్మ వెళ్ళిందా – ప్రతిరోజూ అమ్మ నేనూ ఒక్క మారైనా ఆవిడ గురించి మాట్లాడకుంటూనే ఉన్నాం. నెలకో పదిహేను రోజు లకో, అమ్మమ్మ – తానెక్కడున్నదీ, ఆరోగ్యం ఎలా ఉన్నదీ క్లుప్తంగానైనా ఉత్త రాలు రాసేది. ఈ మారెందుకో రెండు నెలలయినా ఉత్తరమే రాలేదు! నేను చదు వులో పడ్డాను. అమ్మమ్మని తల్చుకొని పుస్తకం పట్టుకుంటే – ఎలాంటి పాఠ మైనా క్షణంలో వచ్చేది. దీపం పెట్టుకుకూర్చుంటే చుట్టూరా కాంతిలో అమ్మమ్మే ఎదురై నాకెంతో ధైర్యం చెబుతున్నట్లుండేది! అమ్మమ్మ కాంతి సూర్యు డికీ, చంద్రుడికీ, దీపాలకి అతీతమైంది కాబోలు!"

***

శివరాత్రి దగ్గరపడుతోంది. అమ్మమ్మ తప్ప కుండా వస్తుందని అమ్మా నేనూ గంపెడాశతో ఎదురు చూస్తున్నాం. అమ్మమ్మ పడుకునే పరుపు బాగా మాసి తూట్లు పడుతోంది. దానికి కొత్త గుడ్డ కుట్టించి – దూది ఏకించి పరుపుకుట్టిం చింది. అమ్మా నేనూ కలిసి మంచం కూడా బిగించాం!

శివరాత్రి వచ్చేసింది. కాని అమ్మమ్మ రాలేదు. ఏమిటో మా యిద్దరికీ తోచలేదు. స్నానాలకి కూడా వెళ్ళలేదు. మనసు ఎందుకో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అమ్మకి మరీ దిగులుగా ఉంది. వంట ప్రయత్నం కూడా చేయకుండా వీధి హాలులో అమ్మా నేనూ దిగాలుపడి కూర్చున్నాం. అమ్మమ్మ గురించే మాట్లాడుకుంటున్నాం.

వీధిలోంచి కేక వినిపించి పరుగుపెట్టాను! ఇంకేముంది? టెలిగ్రాం! అమ్మమ్మ చనిపోయిం దనీ; వెంటనే బయలుదేరి రమ్మనీ – లక్ష్మీపతి గారు! ఆ వాక్యం చదివి వినిపించే సరికే అమ్మ మ్రాన్పడిపోయింది!

"ఇలాంటి ఉప్పెనోదో వస్తుందని నాకు ఉదయం నించీ తడుతూనే ఉందిరా బాబూ! లే – పెట్టెలోని బట్టలూ, నా బట్టలూ సర్దు! ఇంకే ముంది? పద బయల్దేరుదాం!"

అమ్మగాని నేనుగాని బావురుమని ఏడవ లేదు. కన్నీళ్లు మాత్రం ఎంత తడుచుకున్నా ఆగడం లేదు! టెలిగ్రాం చేరిన ఒక గంటకే రైలెక్కాం. ప్రయాణం చేస్తున్నంతసేపూ అమ్మ నాతో ఒక్క మాటయినా మాట్లాడ లేదు. ఇద్ద రమూ ముఖముఖాలైనా చూసుకోలేదు! మేము లక్ష్మీపతి గారింటికి వెళ్ళేసరికి అమ్మమ్మ – హాయిగా నిద్రపోతున్నట్లే వుంది. ఒంటి నిండా రంగురంగుల పువ్వులు ధరించింది. గొప్ప సువా సనగా అగరువొత్తులు వెలుగుతున్నాయి. ఒళ్ళంతా హారతి కర్పూరం పొడి వాసనలు చిమ్ము తోంది!

అప్పటికప్పుడే ఇద్దరు ముగ్గురు కూతుళ్ళు వచ్చారు. ఇద్దరు కొడుకులు కూడా వచ్చారు. ఆ వూళ్ళో జనం ఎంత మంది వచ్చారో! వెడుతున్న వారు వెడుతూంటే – వస్తున్న వారు వస్తూనే ఉన్నారు. "సుశీలమ్మ తల్లీ వచ్చేవా? మనకింక అమ్మలేదు!" అంటూ బావురుమన్నారు లక్ష్మీపతి గారు! లక్ష్మీదేవమ్మ మాట చెప్పనే అక్కర్లేదు. అమ్మని కావిలించుకొని ఒక్కటే రొదగా యేడుస్తోంది! అమ్మ అందరినీ తప్పించుకొని వెళ్ళి అమ్మమ్మ మీద పడిపోయింది. నెత్తీనోరూ బాదుకుంటూ అప్పుడు బావురుమంది. నేనూ మరోప్రక్క అమ్మమ్మ చేతిని పట్టుకొని కూని రాగాలు తీస్తున్నాను.

లక్ష్మీపతి గారింటి ఆవరణంలో జనం పోగులు పోగులుగా ఉన్నారు. ఎవరి నోట విన్నా జానికమ్మ గారి కీర్తిగానమే వినిపిస్తోంది.

అమ్మమ్మ పడుకున్న దగ్గరికి అప్పుడే వచ్చారొక ముసలాయన. కర్ర ఊత లతో ఒంగిపోయి నడుస్తున్నాడు. తొక్కలు వ్రేలాడుతున్నాయి. వచ్చి తల దగ్గర కూర్చున్నారు. "జానికమ్మ తల్లీ వెళ్ళిపోయావా?" అన్నాడు ఒణుకుతున్న గొంతుతో! మహాతల్లి దీపంలా వెలిగింది... దీపంలాగే వెళ్ళిపోయింది. మనమే దురదృష్టవంతులం! ఐనా ఎవరూ ఏడవ కూడదమ్మా... ఆ మహనీయురాలు దేవత! మన ఏడుపులు చూడలేదమ్మా! ఎందరి కష్టాలకాదుకుందో! ఎన్నెన్ని గుప్తదానాలు చేసిందో "మహాతల్లి!" అంటున్నాడాయన. ఏడవ వద్దంటూనే ఆయన వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు!

మధ్యాహ్నం రెండు గంటలకల్లా అమ్మమ్మ కూతుళ్ళు పదిమందీ వచ్చారు. కొడుకులు నలు గురూ జమాజట్టీల్లా సిద్ధంగానే ఉన్నారు. ముగ్గురు కొడుకులూ మూడు భుజాలు కాయగా – వర్ధనమ్మ పిన్ని భర్త నారాయణమూర్తి నాలుగో కొమ్ము కాశారు. లక్ష్మీపతిగారు తలగోరు పట్టారు. వెనకగా కూతుళ్ళంతా నడవగా – అమ్మమ్మ పూలరథం కది లింది. ఇంతకా వచ్చినా ముసలాయన "శ్మశానానికి స్త్రీలు రావడం రివాజు కాదమ్మా!" మీరు వెనక్కి తగ్గండి! ఆవిడకేం మహనీయురాలు! వెళ్ళిపో తోంది" అన్నారు. అయినా ఒక్కరూ వినిపించుకో లేదు. జానికమ్మ అక్కయ్య మాత్రం నన్ను పట్టేసు కుని వెళ్ళనిచ్చింది కాదు.


అమ్మమ్మకి అగ్నిసంస్కారం చేస్తుంటే – ఏదో తేజస్సు లేచి ఆకాశంలోకి వెళ్ళిపోయిందట! స్పష్టంగా తనకి కనిపించిందని వర్ధనమ్మ పిన్ని సత్య వతి పిన్నితో చెబుతుండగా నేను విన్నాను.

లక్ష్మీపతిగారు – కర్మ పది రోజులూ వైభవంగా జరిపారు. పెద్ద పెళ్ళిలాగే జరిగింది. వెనకాముందూ చూడకుండా దశ దానాలూ చేశారు. ప్రతి రోజూ ప్రతి వారూ అమ్మమ్మ గురించే మాట్లాడుకొనే వారు. ఆ నోటా ఆ నోటా వినగా నాకు తెలిసిందేమిటే అమ్మమ్మ తన డబ్బంతా కొడుకులకీ కూతుళ్ళకీ తనకి తోచిన విధంగా ముట్ట చెప్పిందట!

ఇంతకీ అమ్మమ్మ వెళ్ళిపోయింది. ఆవిడ సంచ రించే దీపం వంటిది! ఆమె ఎవరిదగ్గరకు వస్తే వాళ్ళ మొగాలు కాంతిలో తళతళలాడేవి. అలా నడచి ముందుకు వెళ్ళిపోతే మళ్ళీ చీకటి వ్యాపించేది. ఇప్పుడామె మళ్ళీ తిరిగి రాదు. ఆ దీపం ఏ ఆవలి లోకాలకు వెళ్ళిపోయిందో? ఎన్ని మొగాలపై చీకటి పడిపోయిందో!!

*

***(1981 ఆంధ్ర సచిత్ర వారపత్రిక)***



## నవ్వంటే లవ్వు....

ప్రతి ఒక్కరికీ తమ శరీరంలో ఏదో ఒక భాగం అంటే విపరీతమైన ఇష్టం ఉంటుంది. అలాగే కొందరు తమ నడకను ప్రేమిస్తే, మరికొందరు తమ నవ్వును విపరీతంగా ఇష్టపడతారు. టాలీవుడ్ అరుంధతి అదే హీరోయిన్ అనుష్కకు తన నవ్వంటే చాలా ఇష్టం అట! తన నవ్వు చూసే అభిమానులు వెర్రెత్తిపోతారట! చాలా మంది నవ్వును చూసే తనను ప్రేమిస్తున్నారట! ఇంతమందిని ఇన్ని విధాల ఆకర్షించిన తన చిరునవ్వంటే తనకూ ఇష్ట మేనట! 'ఆడదాని చిరునవ్వుకు పడిపోని మగధీరు డెవ్వడు?' అంటూ డైలాగులు కూడా చెప్తోంది. నవ్వుతో కలిగే ఆరోగ్య లాభాల గురించి ఇటీవల ఓ పుస్తకంలో చదివిందట! అప్పటి నుంచి నవ్వు అంటే మరీ ఇష్టం ఏర్పడింది అంటూ చెప్పుకొచ్చింది.